క్లుప్తంగా

నేడు త్రివేణి ఎక్స్‌పో

సూర్యాపేటటౌన్ : సీవీ రామన్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని త్రివేణి హైస్కూల్‌లో బుధవారం త్రివేణి ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ హరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సులర్ వెంకటరత్నం, నల్లగొండ మహాత్మాగాంధీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.ప్రశాంతి తదితరులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యువత క్రీడల్లో రాణించాలి



బహుమతులు పొందిన విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : యువత క్రీడల్లో రాణించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సొసైటీ అధ్యక్షుడు రుద్రాక్షి నర్సింహ, జెడ్పీ బాలుర పాఠశాల హెచ్ఎం గోలి పద్మ అన్నారు. ట్రైబల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ నల్లగొండ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతో ఉపకరిస్తాయన్నారు. అనంతరం కబడ్డీ, రన్నింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాయిరాం, శ్రీనివాస్‌రెడ్డి, సునీత, మంజుల, అరుణభారతి, ఉపేందర్, కాలరాం, విశ్వజ్ఞచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అర్వపల్లి : మండల పరిధిలోని కోడూరు గ్రామ విద్యుత్ సబ్ స్టేషన్‌లో బుధవారం మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని విద్యుత్ ఏఈ వాస శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని లోయపల్లి, తిమ్మాపురం, కోడూరు, కొమ్మాలతో పాటు ఆవాస గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పస్తాలలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నాగారం : మండల పరిధిలోని పస్తాల గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15లక్షలతో గ్రామంలోని పూలగడ్డ బజార్‌లో సీసీరోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జ శ్రీధర్, బొండగొర్ల కుమార్, కండె అంజయ్య, కట్టంగూరి వెంకట్‌రెడ్డి, జక్కి కాశయ్య, అంజయ్య, సతీష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని చందుపట్లలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఓ రాజేష్, ఏపీఓ గుండు వెంకన్న, టీఏ మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రధాన రహదారులు



చివ్వెంల నుంచి పాండ్యానాయక్ తండాకు వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



పిల్లలజెగ్గుతండా నుంచి వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి వెళ్లే రహదారిలో పెరిగిన కంపచెట్లు



పాశ్యానాయక్ తండా నుంచి సూర్యతండాకు వెళ్లే రహదారికి ఇరువైలా..

- చివ్వెంల మండలంలోని పలు గ్రామాల రహదారుల్లో మూలమలుపులు
- రోడ్లకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

చివ్వెంల : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు కంప చెట్లతో అల్లుకొని ప్రమాదకరంగా మారాయి. అంతేకాకుండా మూలమలపులు ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సూర్యాపేట-ఖమ్మం రహదారిపై మండల కేంద్ర శివారులో మూలమలుపులు అధికంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మండల కేంద్రం నుంచి పాండ్యానాయక్ తండాకు వెళ్లే దారిలో ఉన్న మలుపు వద్ద ఇప్పటికే చాలాసార్లు ప్రమాదాలు జరిగాయని స్థానికులు అంటున్నారు. మూలమలుపుల వద్ద అధికారులు కనీసం ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. పైగా రహదారులకు ఇరువైపులా ముళ్లచెట్లు పెరిగాయి. రోడ్ల వెంబడి ముళ్లచెట్లను తొలగించకపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. పిల్లలజెగ్గుతండా నుంచి బద్యాతండా మీదుగా వట్టిఖమ్మంపహాడ్ వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు విపరీతంగా పెరిగాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల వెంబడి కంపచెట్లను తొలగించాలని, మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

రహదారుల వెంట ముళ్లకంప పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా ఆయా గ్రామాల రహదారులకు మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రోడ్ల వెంబడి కంప చెట్లు తొలగించాలి. రహదారులపై ఏర్పడిన గుంతలు పూడ్చివేయాలి.

- బానోతు లింగానాయక్, బద్యాతండా

ప్రమాదాలు జరుగుతున్నాయి

మూల మలుపుల వద్ద దారి కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వట్టిఖమ్మంపహాడ్-పిల్లల జెగ్గు తండా మధ్య రహదారి ప్రమాదకరంగా మారింది. మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

- కిరణ్ కుమార్, వట్టిఖమ్మంపహాడ్

పనులు చేపడుతాం

గ్రామాల రహదా రుల సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నూతనంగా వేసిన అన్ని రోడ్లకు సౌకర్యాలు కల్పించాం. త్వర్లోనే పాత రోడ్ల వెంబడి మూల మ లుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. సమస్యను పరిష్కరిస్తాం.

- ధరావత్ లింగానాయక్, పీఆర్ఏఈ

తిరుమలగిరి మున్సిపల్ బడ్జెట్ ఆమోదం



తిరుమలగిరి మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రజినీరాజశేఖర్

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ 2024-2025 వార్షిక బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం తెలిపింది. మున్సిపల్ చైర్ పర్సన్ పోతరాజు రజినీరాజశేఖర్ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి రూ.42.86 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా రూ.39 కోట్ల 88 లక్షలు, సాధారణ ఆదాయం రూ.2 కోట్ల 91 లక్షలు రానున్నట్లు పేర్కొన్నారు. గ్రీన్ బడ్జెట్ కింద రూ.28 లక్షల 26 వేలు, అభివృద్ధి పనులకు రూ.5 లక్షల 83 వేలు, సిబ్బంది జీతభత్యాలకు రూ.ఒక కోటి 12 లక్షలు, విద్యుత్ చార్జీలకు నెలకు రూ.6 లక్షల చొప్పున వ్యయంగా చూపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామచొక్కంరెడ్డి, వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు పెంచిన వేతనం చెల్లించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సిబ్బంది

తిరుమలగిరి : 2023 మే నుంచి పెంచిన రూ.వెయ్యి వేతనాన్ని వెంటనే ఇవ్వాలని మున్సిపల్ కార్మికులు మంగళవారం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత పది నెలల నుంచి పెంచిన వేతనం ఇవ్వడం లేదన్నారు. తమ అకౌంట్లలో పీఎఫ్ జమ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన వేతనాలు ఇవ్వకుంటే ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లమ్మ, యాదమ్మ, సురేష్, రాజు, సుగుణమ్మ, అరుణ, రాములు, భాస్కర్, అనిత పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరపాలి..

తిరుమలగిరి : మున్సిపాలిటీలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని కౌన్సిలర్లు వై.నరేష్, జితేందర్, బత్తుల శ్రీను, భాస్కర్, హన్మంతు కోరారు. మంగళవారం వారు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపాలిటీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని తెలిపారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా ఇష్టానుసారంగా నియమించిన వారిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్, గతంలో ఇక్కడ పని చేసిన కమిషనర్ మున్సిపాలిటీని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. కౌన్సిల్ తీర్మానం లేకుండా ఏ ఒక్క రూపాయి ఖర్చు చేయవద్దన్నారు.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అని సెంటర్లలో ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో డీఐఈఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి సెంటర్‌లో ఇద్దరు ఏఎన్ఎంలు ఉండాలని, మెడికల్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. అన్ని పరీక్షలను జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పిడమర్తి భరత్, రహీం, మోహన్, సాయి, చరణ్, మహేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చీదెళ్లలో కొనసాగుతున్న జాతర



పెన్‌పహాడ్ : చెట్లముకుందాపురంలో దేవతామూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో కొనసాగుతున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మగోపయ్య జాతరలో మంగళవారం నాలుగో రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెట్లముకుందాపురంలో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌లో పుర వీధులగుండా ఊరేగించారు. భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామం నుంచి ప్రభబండ్లను దేవాలయం వద్దకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయిరాల శోభ, కొండమీది గోవిందరావు, మిర్యాల కృష్ణమూర్తి, అనంతుల సతీష్‌గౌడ్, పానుగోటి నరేందర్, గోపాలకృష్ణ, మోదాల గోపి, నాగరాజు, కట్టెల విజయ్‌కుమార్, దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

చీదెళ్ల గ్రామంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మగోపయ్య స్వామి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన తెలుగు రాష్ట్రాల స్థాయి ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు మంగళవారం హోరాహోరీగా కొనసాగాయి. ఈ పోటీల్లో పలు జిల్లాల నుంచి కబడ్డీ క్రీడాకారులు పాల్గొని తలబడ్డారు. పోటీలను చూసేందుకు క్రీడాభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం నలబోలు చంద్రారెడ్డి-గోపాల్‌రెడ్డిల జ్ఞాపకార్థం నలబోలు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి, మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, నలబోలు వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, లింగారెడ్డి, వెన్న సైదిరెడ్డి, వరికల్లు శ్రీను, విలాసకవి వెంకటరాజు, కీర్తి వెంకట్రావుగౌడ్, జూలకంటి రాజశేఖర్‌రెడ్డి, మద్ది అంజిబాబుగౌడ్, గొట్టిపర్తి గోవిందు, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



అన్నదానం చేస్తున్న దాతలు

సీపీఎం నాయకుడికి నివాళి

నూతనకల్ : మండల పరిధిలోని వెంకెపల్లి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు దూదిగాని లింగయ్య(42) మృతి పార్టీకి, ప్రజా సంఘాలకు తీరని లోటని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం లింగయ్య మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ అభివృద్ధి కోసం లింగయ్య అహర్నిశలు పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దూదిగాని ఎల్లయ్య, బత్తుల జనార్దన్, తొనుకునూరి ఉప్పలయ్య, కూసు సైదులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగానంద లక్ష్మీనర్సింహుడి రథోత్సవం

- భారీగా తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



అర్వపల్లిలో రథాన్ని లాగుతున్న నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం ఎంతో ప్రధానమైనది. తొలుత ఆలయంలో సదస్యం కార్యక్రమాన్ని జరిపారు. ఆ తర్వాత నర్సింహస్వామి, శ్రీదేవి, భూదేవీలను రథంపై ఊరేగించారు. రథోత్సవ ఊరేగింపు దేవాలయం నుంచి మెయిన్‌రోడ్డు వరకు వెళ్లి అక్కడ భక్తులకు దర్శనమిచ్చి తెల్లవారుజామున ఆలయానికి చేరింది. వేడుకల్లో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ, మండల అధ్యక్షులు వేల్పుల రమేష్, శిగ నసీర్‌గౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు..

రథోత్సవం సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రముఖ సినీ గాయకుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ ఫణివంశీ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. శ్రీవాసు, విజయ్, వేదవ్యాస్, రాజు, రజితలు తమ బృందాల ఆధ్వర్యంలో ప్రదర్శనలు ఇచ్చారు. రథోత్సవానికి హాజరైన భక్తులందరికీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అలాగే కోలాటం, బోనాల ప్రదర్శనలు కూడా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకొని రథోత్సవాన్ని, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. స్థానిక ఎస్ఐ మహేందర్‌నాథ్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు లక్ష్మాజీ, జేరుపోతుల సోమయ్య, దిర్శనపు కృష్ణమూర్తి, రేణుక, అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, శేషాద్రిదీక్షితులు, యోగానంద్, పవన్‌కుమార్, యాజ్ఞికుడు మాధవాచార్యులు, నాయకులు బైరబోయిన సైదులు, మహరాజు, బింగి శ్రీకాంత్, కోమటి సోమయ్య, మేకల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

నాన్యతండా గ్రామ పంచాయతీ ఆవాసం లచ్చిరాం తండా ప్రాథమిక పాఠశాల వి ద్యార్థులు, ఉపాధ్యాయులు, తండా గిరిజనులు మంగళవారం అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎలుక కృష్ణారెడ్డి, తండా గిరిజనులు జాటోతు శ్రీనివాస్, నాగమణి, కేలోతు సత్తమ్మ, కె. బిక్కి పాల్గొన్నారు.



రథంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు వేడుకలో పాల్గొన్న భక్తులు



మహిళల కోలాట ప్రదర్శన

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తుంగతుర్తి : మండల కేంద్రంలో బుధవారం నుంచి జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పరీక్ష ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. తుంగతుర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, గిరిజన గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో 392మంది, సెకండియర్‌లో 361మంది, ఒకేషనల్ ఫస్టియర్‌లో 74మంది, సెకండియర్‌లో 63 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరుకావాలని, ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించమని పేర్కొన్నారు. ఆయనతోపాటు డీఓ గుండగాని శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధి లోని మోడల్ స్కూల్, నిర్మల సహకార జూనియర్ కాలేజీలో ఇంటర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ వేముల బాలరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 256 మంది, ద్వితీయ సంవత్సరంలో 245 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు గంట ముందు రావాలని సూచించారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులుగా వివిధ వేషధారణల్లో అలరించారు. ప్రతిభ చూపిన వారికి హెచ్ఎం సీహెచ్. నర్సయ్య బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధూకర్, సంధ్యారాణి, రవి, గోపాల్, పురుషోత్తం, శ్రీరాములు, విమల, శ్రీధర్, పుష్పవతి, భవాణి, గురుప్రసాద్, రాములు, వెంకన్న, శ్రీనివాసు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్‌లో..

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మండల విద్యాధికారి గోపాల్‌రావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు రామక్రిష్ణ నాయక్, మోహన్ రెడ్డి, యలమంచిలి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి మహోత్సవానికి విరాళాలు అందజేత

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడంలో నిర్వహించే బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు, శివాలయ నిర్మాణం, విగ్రహాల ప్రతిష్ఠాపన, మహంకాళి గుడి నిర్మాణానికి గ్రామానికి చెందిన పలువురు దాతలు విరాళాలు అందజేశారు. సంకినేని శ్రీధర్‌రావు రూ.1,18,000, ముక్కాల భిక్షంరెడ్డి రూ.50116, వల్లపు రమేష్ యాదవ్ రూ.50,116, కోలన్ జ్యోతి మాణిక్యరెడ్డి రూ.25,116, పాక మధుయాదవ్ రూ.25,116లను మంగళవారం ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు వల్లపు కళింగం యాదవ్, ముక్కాల అవిలమల్లు, బీసు పెద్ద వీరన్న, మద్దెల భిక్షపతి, లింగంపెల్లి మల్లయ్య, మద్దెల యాకయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్ఐ వెంకట్‌రెడ్డికి సన్మానం

నాగారం : నాగారం మండల నూతన ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డిని మండల యూత్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐను సన్మానించిన వారిలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యలమకంటి సోమన్న, సోషల్‌మీడియా కోఆర్డినేటర్ కొలిపాక సాయికుమార్, గుడ్డేటి సురేష్, కన్నెబోయిన నాగరాజు, మహేందర్, విక్రం తదితరులు ఉన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో ఉద్యమించాలి

ఆత్మకూర్(ఎస్) : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుపరం చేస్తూ.. ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్న పరిస్థితుల్లో యువత చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో ఉద్యమించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని ఏపూరు, తుమ్మలపెన్‌పహాడ్, ఆత్మకూరు, బొప్పారం, పాతసూర్యాపేట గ్రామాల్లో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడారు. రైతులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే.. వారిపై తుపాకులు ఎక్కుపెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై యువకులు చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా కోశాధికారి బండి రవి, నాయకులు దడిగల లింగయ్య, కుంట రవి, గంగరబోయిన రమేష్, ఎల్లుట్ల గణేష్, కొమ్ము సుభాష్, గణేష్, కేశబోయిన మల్లేష్, కొమ్ము నరేష్, శిరీష, సంధ్య, లిఖిత్, మాన్యశ్రీ, మధు పాల్గొన్నారు.

తుంగతుర్తి : చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో ఉద్యమించాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల నాగయ్య అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యువత దేశభక్తిని పెంపొందించుకొని మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త బొంకూరి నాగయ్య, వినయ్, విశ్వతేజ, కార్తీక్, నవదీప్, నాగేంద్ర, శివాని, మధుప్రియ, సాహితి, రాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఏపూరులో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీవైఎల్ నాయకులు



తుంగతుర్తిలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

వ్యవసాయానికి 21 గంటల విద్యుత్

మునగాల : జిల్లాకు చెందిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఆదేశాల మేరకు వ్యవసాయ రంగానికి ప్రస్తుతం 21 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు మునగాల ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏడీఈ ఆర్.వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం మునగాలలోని ఏడీఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనివార్య కారణాల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి బ్రేక్‌డౌన్ అయితే ఆ సమయాన్ని తిరిగి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మునగాల మండలంలోని ముకుందాపురం వద్ద మరో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలియజేశారు. త్వరలోనే సబ్ స్టేషన్ మంజూరు కానున్నట్లు తెలిపారు. మునగాల, నడిగూడెం, మోతె, అనంతగిరి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సమస్యలు తలెత్తితే ఏడీఈ ఆపరేషన్ సెల్ నంబర్ 9491056419, వికాస్ ట్రాన్స్‌కో ఏఈ సెల్ నంబర్ 9440813612 లకు ఫోన్ చేస్తే వెంటనే సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న వారికి 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసేందుకు తమ శాఖ సమాయత్తమవుతుందన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఏఈ వికాస్, సబ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ మారం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.